క్లుప్తంగా

మరికల్ తహసీల్దార్‌గా అనిల్‌కుమార్

మరికల్: మండల తహసీల్దార్‌గా అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపల్లి నుంచి మరికల్‌కు బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టాగానే ఆర్ఐ సుధాకర్‌రెడ్డితో పాటు సిబ్బంది సన్మానించారు. అనంతరం నూతన తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలపై వచ్చే ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్‌గా విధు లు నిర్వహిస్తున్న జమీల్ నారాయణపేట ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా బదిలీపై వెళ్లారు.

తహసీల్దార్‌గా జయరాములు

కొత్తపల్లి: మండలంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ మరికల్ మండలానికి బదిలీ కాగా దామరగిద్దలోని విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ జయరాములు శుక్రవారం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడులో ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ అనిల్‌గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, మాజీ సర్పంచ్ కల్పన, కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకటేష్, రాజు, అబ్దుల్, దాసరి వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కోస్గి: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యను పాఠాలు బోధించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా అంజలి, డీఈఓగా సుష్మా, ఎంఈఓగా ఉమాదేవి, హెచ్‌ఎంగా భార్గవి, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, విద్యాసాగర్, శ్రీలత, రాములు, టీక్యానాయక్, విజయలక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.

మద్దూరు: మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మహేష్ పాల్గొన్నారు.

స్వీపర్‌కు సన్మానం

మక్తల్: మండలంలోని సంగంబండ ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ ఈశ్వరయ్య పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా శుక్రవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.. ఈశ్వరయ్య పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎంలు రాఘవేంద్రర్‌రావు, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రకళ, అనిత, నాయకులు బాల్‌రెడ్డి, సిదార్థరెడ్డి, నాగప్ప పాల్గొన్నారు.

సీఆర్పీలకు..

కృష్ణా: మండలంలో గత పుష్కర కాలం సీఆర్పీలుగా విధులు నిర్వహించిన రమేష్, ఉసెనప్పను శుక్రవారం డీఈఓ గోవిందరాజులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖలో సీఆర్పీలుగా విధులు నిర్వహించి ఈ రోజు వారు స్కూల్ అసిస్టెంట్‌లుగా నియామకమై శిక్షణకు హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల సీఆర్‌పీ అమీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా హిందీ దివస్

కోస్గి రూరల్: పట్టంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలో శుక్రవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాలలో హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం వెంటకేశ్వరి మాట్లాడుతూ.. ఏ దేశంలో ఉన్నా భారతీయులంతా ఒక్కటే అనే భావనతో ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు శశిరేఖ, శ్రీదేవి, నవిత, గీతాలక్ష్మి, సుజాత, వసంత, హేమలత, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.





గుడెబల్లూర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో



చిత్తనూర్ రామాలయంలో సుదర్శన హోమం పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు



మక్తల్ శ్రీవేంకటేశ్వర ఆలయంలో ..

మక్తల్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నగరేశ్వర ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, కోళ్ల వెంకటేష్, రవికుమార్, కట్టసురేష్ పాల్గొన్నారు.



మక్తల్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు

మరికల్: మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చిత్తనూర్ రామాలయం వద్ద భక్తులు సుదర్శన హోమం నిర్వహించారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో అర్చకులు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే ఉత్సవ విగ్రహాలకు భక్తుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా హిందుపూర్‌లో శ్రీరామ ఆలయంలో పూజలు చేశారు.

పాఠశాలల్లో ముగ్గుల పోటీలు



మరికల్‌లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణపేట రూరల్: మండలంలోని అమ్మిరెడ్డిపల్లి, కోటకొండ, కొల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా రంగు రంగులతో ముగ్గులను వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

మరికల్: మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ముగ్గుల చుట్టూ బొడ్డెమ్మలు వేసి అలరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు కరస్పాడెంట్ షఫిద్దిన్ బహుమతులను అందజేశారు.

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అందమైన ముగ్గులతో తమ ప్రతిభను చాటుకున్నారు.



మొగులమడ్క ఉన్నత పాఠశాలలో..



పేటలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

నారాయణపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ సైన్యం సన్నద్ధమవ్వాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీవీఆర్ భవన్‌లో నియోజకవర్గంలోని కోయిలకొండ మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లోని ప్రకటించే అభ్యర్థులను గెలిపించేందుకు ఇప్పటి నుంచే కదం తొక్కాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సాయి మందిరంలో శుక్రవారం గ్రామీణ వైద్యుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను కుంభం శివకుమార్ రెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ గందే అనసూయ, కోట్ల రవీందర్ రెడ్డి, సంఘం నాయకులు నర్సింగ్‌రావు, రాములు, పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



దామరగిద్దలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు



నర్వలో వినతి పత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దామరగిద్ద: ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని బీజేపీ నాయకులు గోపాల్‌రావు, సంజీవగౌడ్ అన్నారు. శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మాట్లాడారు.. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జయరాములుకు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా నాయకులు అబ్దుల్‌నబీ, మోనేష్, హన్మంతు, ఆశప్ప, రాజ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్దూరు: మండల బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శంకర్, సుజాత, బర్లరవికుమార్, రాఘవేంద్రచారి, హరీష్ పాల్గొన్నారు.

కోస్గి రూరల్: ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు మండల తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఆశ చూపి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ రాము, వెంకటేష్, శ్రీకాంత్, పద్మ, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన కాంగ్రెస్

నర్వ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీఆర్‌ఎస్ మండల నాయకులు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని పూర్తిస్థాయిలో అందించకుండా ప్రజలను వంచించిందన్నారు. అనంతరం తహసీల్దార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మహేశ్వర్ రెడ్డి, జయప్ప, వీణావతి శంకర్, కరుణాకర్‌రెడ్డి, రఫీ, రాజారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వంతో విజయం సులువు

కోస్గి: విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా మానసిక దృఢత్వంతో శ్రద్ధగా చదివాతే విజయం సులువవుతుందని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ కరీం సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు మానసిక నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్లను ఎక్కువగా వాడటంతో విద్యార్థులు మానసిక రుగ్మతలకు గురవుతారని తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. చదువు ఒక్కటే ముఖ్యం కాదని.. మానసిక శక్తి సామర్థ్యాలను బలపర్చేందుకు మానసిక నైపుణ్యాలను ప్రేరేపించాలన్నారు. అనంతరం మనోవికాసం లోగోను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మెమోరీ కాంటెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. అంతర్జాతీయ మెజీషియన్ రామకృష్ణ తన ఇంద్రజాల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటు ఆపాలని వినతి

నారాయణపేట: మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో సర్వే నం. 17లో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ఆపాలని శుక్రవారం కలెక్టరేట్ ఏఓ జయసుధకు రైతు సంఘం నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు, ఆర్డీఓలు ఆ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు పరిశీలించారని వాటిని ఆపాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు నర్సింహ, టి మాధవ్, కథలప్ప, బాలు, రైతులు కిష్టప్ప, బొక్క వెంకటేష్, గోవిందమ్మ, రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ధన్వాడ: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో ఆరుగురిని ఎంపిక చేశారు. ప్రతి అభ్యర్థికి ఒక గుర్తింపు సింబల్ అందజేశారు. ముందుగా ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు పాఠశాలలోని ప్రచారం చేశారు. తమకు ఓటు వేస్తే ఏలాంటి పనులు చేస్తామనే విషయాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఇందులో మొత్తం 504మంది విద్యార్థులు ఓట్లు వేశారు. ఓట్లు లెక్కింపు తరువాత 231ఓట్లతో సాత్విక్ లీడర్‌గా ఎంపికయ్యారు. వారికి ఎన్నికల అధికారి నియామకపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీవన ఎరువు పంపిణీ

మద్దూరు: రైతులకు సబ్సిడీపై జీవన ఎరువును శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ వ్యవసాయాధికారులతో కలిసి రైతులకు అందజేశారు. ఒక కిలో జీవ ఎరువు రూ. 50 కాగా సబ్సిడీపై రూ. 20కే రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక ఎకరాకు 2 లేదా 3 కిలోల కల్చర్ పొడిని 100 కిలోల బాగా మరిగిన పశువుల ఎరువులో కలిపి చల్లుకోవాలని ఏఈఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, నాయకులు బాబుస్వామి, పురుషోత్తం, బస్వరాజ్, ఏఈఓలు శ్వేత పాల్గొన్నారు.

దండోర ధూంధాం ప్రచార రథయాత్ర

కొత్తపల్లి: వెయ్యి గొంతుకలు లక్ష డప్పులు మహా కళాప్రదర్శనలో భాగంగా దండోర ధూంధాం ప్రచార రథయాత్రను చేపట్టామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో దండోర ధూంధాంను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతి గొప్పతనాన్ని, వారికి జరిగిన నష్టాన్ని, ఏబీసీడీల వర్గీకరణలో పడ్డకష్టాలను వివరించారు. వచ్చేనెల 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నరేష్, ప్రభుదాస్, దుబాయ్ కృష్ణ, డేవిడ్, డీలర్ వెంకటయ్య, పార్వతీశం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం!

నారాయణపేట: సంక్రాంతి పండగ సందర్భంగా పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు.. ఊర్లకు వెళ్తారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు.. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ.. ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్‌నంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తారన్నారు. జిల్లాలో పోలీసులు ఇప్పటికే సీసీ టీవీలను ఇన్‌స్టాల్ చేశామని తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించామన్నారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమమన్నారు. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు 8712670399 కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.

వివేకానందుడి అడుగుజాడల్లో నడుద్దాం

నారాయణపేట రూరల్: స్వామి వివేకానందుడుని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, స్నేహ ఆసుపత్రి సంయుక్తంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని శ్రీ సాయి కళాశాల, ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 350మంది విద్యార్థులకు బ్లడ్ టెస్ట్ నిర్వహించి వారి గ్రూపులను తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, హెచ్‌ఎం సునీత, ఏబీవీపీ నాయకులు నరేష్, చరణ్ పాల్గొన్నారు.



బ్లడ్ గ్రూప్ చెక్ చేస్తున్న సిబ్బంది

శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

నర్వ: నేటి ఆధునిక ప్రపంచంలో దూసుకపోతున్న శాస్త్ర, సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కలాం స్ఫూర్తియాత్ర ముగింపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మధులాష్‌బాబు మాట్లాడుతూ.. అబ్దుల్‌కలాం స్ఫూర్తిగా రాష్ట్రంలో ఇప్పటికి ఆరు జిల్లాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను చేపట్టి ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు హైదరాబాద్‌లో రోబోటిక్ శిక్షణపై వీరికి అవగాహన కల్పిస్తామన్నారు. నర్వ మండలాన్ని ఎన్నుకుని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఎంఈఓ రామకృష్ణ, నాయకులు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీజసోగల అర్చన పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

నారాయణపేట రూరల్: రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో చాలా వరకు ప్రమాదాలను నివారించొచ్చునని ఏఎస్ఐ బాలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు.. వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్‌ను తప్పకుండా ధరించి ఉండాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రదీప్, కామారెడ్డి, స్వాతి, రాజేశ్వరి, డీఎస్‌ఓ హెచ్ భానుప్రకాష్, తపస్ జిల్లా కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యాయులు నిర్మల, విజయ, మంగళ తదితరులు పాల్గొన్నారు.



పేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..

మక్తల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌లను పాటించాలని ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్ఐ రాజు అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..

కోస్గి/కోస్గిరూరల్: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని ఎస్ఐ బాలరాజు అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన చేపట్టారు. వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో వాహనాలు నడపొద్దని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వరి, ఉపాధ్యాయులు పోలీసు సిబ్బంది ప్రసాద్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

మద్దూరు: మండలంలోని మద్దూరు, చెన్నారెడ్డిపల్లి, పెదిరిపాడ్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఏఎంసీ చైర్మన్ భీములు, నాయకులు రఘుపతిరెడ్డి, భూమి పూజ నిర్వహించారు. కడా నిధుల నుంచి మద్దూరు అతిథి గృహానికి రూ.17లక్షలతో ప్రహరీ నిర్మాణం, పెదిరిపాడ్, చెన్నారెడ్డిపల్లిలో అంగన్‌వాడీ భవనాలకు భూమి పూజ చేశారు. ఆరు నెలలోపు వీటిని పూర్తి చేయనున్నట్లు పీఆర్ డిప్యూటీ విలోక్ తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబుస్వామి, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

రూ. 15కోట్లతో పలు అభివృద్ధి పనులు

మక్తల్: పట్టణంలోని మున్సిపల్ పరిధిలో దాదాపు రూ. 15కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.. మంచి నీటి సరఫరా, సీసీరోడ్డు, డ్రెయినేజీ, నూతన పాఠశాల భవనం తదితర కార్యక్రమాలకు ఎంపీ భూమి పూజ చేయనున్నట్లు వారు తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ అఖిల రెడ్డి, కౌన్సిలర్లు ఈసరి కౌసల్య పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఊట్కూరు: మండలంలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సాయంత్రం ఆయన స్వగృహంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిప్పన్న, కాంగ్రెస్ నాయకులు మహేష్‌కుమార్‌రెడ్డి, భీమకవి, విష్ణుమూర్తిగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న సభ్యులు

కనీస వేతనం రూ. 18వేలు అమలు చేయాలి

మక్తల్: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేల అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కరించాలని కోరుతూ.. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడారు.. ఆశలకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాంరెడ్డి, గోవిందురాజు, రమేష్, గౌరమ్మ, ఇందిరా, శాంతమ్మ, శివమ్మ, అనురాధ, సుజాత, వెంకటమ్మ, సావిత్రమ్మ, శశిరేఖ పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

కృష్ణా: మండల కేంద్రంలోని జ్ఞాన సంగమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ ఎండీ నవీద్ మాట్లాడుతూ.. రైతు లేనిదే మానవ మనుగడ ఉండదన్నారు. వ్యవసాయం దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శన అద్భుతం, వారి కృత్యాల ద్వారా రైతుల కష్ట, నష్టాలు స్పష్టంగా తెలియజేశారని, ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో విద్యార్థులకు వ్యవసాయంపై మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, ఎంఈఓ నిజాముద్దీన్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటీల్, కరస్పాండెంట్ శివరాజ్‌పాటీల్, ఈశ్వరప్పగౌడ, నీలకంఠరావు, కావలి మారెప్ప, చంద్రప్ప, మాజీ సర్పంచ్ మహాదేవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ఎండీ నవీద్